
# వైటుకె



**టోక్యో - జపాన్:**

1999 డిసెంబర్ 31. సమయం రాత్రి పదకొండు గంటల యాభై తొమ్మిది నిమిషాల నలభై సెకండ్లు.

సబ్‌వే ట్రాఫిక్ కంట్రోల్ స్టేషన్‌లో గోడ మీద వున్న ఆరడుగుల కంప్యూటర్ తెరని కనురెప్పలు ఆర్పకుండా దీక్షగా చూస్తున్నాడు చీఫ్ ట్రాఫిక్ కంట్రోలర్.

నలభై అయిదు సెకండ్లు చూపిస్తున్నది డిజిటల్ గడియారం. అతని ముఖంలో ఆదుర్దా స్పష్టంగా కనిపిస్తున్నది.

అక్కడవున్న ఇంజనీర్లు, టెక్నీషియన్లూ కూడా చకచకా తమ పనులు చేసుకుంటూనే, మాటి మాటికీ గడియారం వంక చూస్తున్నారు.

మనిషి సృష్టించిన మెషీన్లు. అదేం విచిత్రమో కానీ ఆ మెషీన్లకే మనిషి బానిస అయిపోతున్నాడు. తను సృష్టించినవే తన బ్రతుకుని నడిపిస్తున్నాయి. తను తయారుచేసి మరమ్మత్తు చేసే మరల మత్తులో వున్నాడు మనిషి.

నలభై తొమ్మిది నించీ యాభై సెకండ్లకు కదిలింది సమయం.

చల్లగావున్న ఆ గదిలో అందరికీ చెమటలు పడుతున్నాయి. మూడు సంవత్సరాల నించీ ఎంతమందో కష్టపడి పనిచేసిన వైటుకె సాఫ్ట్‌వేర్ పురుగు తొలిచేస్తుందో, తెరిపినిస్తుందో, తెలుసుకునే సమయం ఇప్పుడాసన్నమవుతున్నది. ఎన్నో రకాల సిమ్యులేషన్స్ చేసినా, వాటిల్లో విజయం సాధించినా..... ఇది అసలు సిసలైన పరీక్షా సమయం.

యాభై అయిదు.

మూడవ సహస్రాబ్ది మొదలవబోతున్నది. ఇరవై ఒకటవ శతాబ్దం ప్రారంభం కాబోతున్నది.

చారిత్రాత్మక సమయం.

యాభై ఆరు.

ఎవరి గుండెల చప్పుడు వాళ్ళకే వినపడుతున్నది.

యాభై ఏడు.

ప్రాణమున్న మనుష్యులు, ఇనుముకీ, ప్లాస్టిక్కీ ప్రాణం పోసిన మనుష్యులు.

యాభై ఎనిమిది.

ఓ మనిషీ! నువ్వు సృష్టికర్తవా? లేక నువ్వే నీ సృష్టి చేతిలోని కీలుబొమ్మవా?

యాభై తొమ్మిది సెకండ్లు. పదకొండు గంటలు, యాభై తొమ్మిది నిమిషాల, యాభై తొమ్మిది సెకండ్లు.

తెరమీద గడియారంలో... అన్నీ సున్నాలు చూపిస్తున్నాయి. అంటే 2000 సంవత్సరం వచ్చేసిందన్న మాట.

అంతే! అంతా చీకటి. ఒక్కసారిగా అంధకారం ఆవహించింది. వైటుకె పురుగు కొన్ని మెగాబైట్లను కొరికేయటంతో కంప్యూటర్లు ఖంగుతిన్నాయి. ఆ కంప్యూటర్లు నడిపిస్తున్న న్యూక్లియర్ పవర్ ప్లాంట్ గాలి పోయిన బుడగలా తుస్సుమన్నది. కరెంటు పోగానే కంప్యూటర్లు ఆగిపోయాయి. ప్రపంచంలో కల్లా పెద్ద పట్టణమైన టోక్యో మహానగరం ఒక్కసారిగా స్థంభించిపోయింది. కీచుమని శబ్దం చేసుకుంటూ ఎక్కడి రైళ్ళక్కడ ఆగిపోయాయి. వాటిలో కొన్ని రైళ్ళు పట్టాలు తప్పి కార్లను, బిల్డింగులను గుద్దుకున్నాయి. ఆ ప్రమాదంలో ఇరుక్కున్న మనుష్యుల ఆర్తనాదాలు, ఆ మనిషే చేసిన మెషీన్ల శంఖారావంలో కలిసిపోయాయి. టోక్యో స్టాక్ ఎక్ఛేంజ్, పెద్ద పెద్ద కంపెనీల, వివిధ బ్యాంకుల కంప్యూటర్లన్నీ మొదటిసారిగా ఆగిపోయాయి. స్టాండ్ బై పవర్ ప్లాంట్లను నడపవలసిన మైక్రోచిప్పు పనిచేయకపోవటంతో అవి కూడా నడవలేదు. దానితో హాస్పిటల్స్‌లో ఎమర్జన్సీ వార్డులతో సహా అన్ని చోట్లా హాహాకారాలు మొదలయ్యాయి. ఎంతమంది రోగుల

ప్రాణాలు ఆ చీకట్లో కలిసిపోయాయో తెలుసుకునేందుకు లేటెస్ట్ డేటాబేస్ - మానిటర్ నల్లటి తెర వెనుక సమాధిలో వుంది.

★ ★ ★

## సింగపూర్:

సింగపూర్ టోక్యో కన్నా సమయంలో రెండు గంటలు వెనకబడి వున్నది. అంటే టోక్యోలో కొత్త సంవత్సరం వచ్చిన రెండు గంటలకు, సింగపూర్‌లో కొత్త సంవత్సరం వస్తుందన్న మాట.

టోక్యో ప్రజా జీవితాన్ని వైటుకె పురుగు తినేసిన పదిహేను నిమిషాలలో, సింగపూర్‌లో ఈ విషయం తెలిసిన అన్ని పరిశ్రమలలోనూ సాంకేతిక నిపుణులు సిద్ధంగా వున్నారు. చాల అమెరికన్ కంపెనీలు సింగపూరులో వున్నందున వాళ్ళందరూ తమ శక్తివంచన లేకుండా చకచకా ఎన్నో టెస్టులు చేసి, అన్నీ సరిగ్గా వున్నాయో లేవో నిర్ధారణ చేసుకుంటున్నారు.

సింగపూర్‌లో అన్ని వీధులలోనూ ప్రజలు ఉత్సాహంగా కొత్త సహస్రాబ్ది కోసం ఎదురు చూస్తున్నారు. ఎక్కడ చూసినా ఉత్సాహం. పాటలూ, డాన్సులూ, మంచి సందడిగా వుంది.

సరిగ్గా పన్నెండు గంటలు కాగానే, అక్కడకూడా వైటుకె పురుగు కాటు వేసింది. మనిషి తను చేసిన మెషీన్ల ముందు మళ్ళీ ఓడిపోయాడు. అందాల సింగపూరు అంధకార బంధురమయి పోయింది. ప్రజా జీవనం స్థంభించిపోయింది. షిప్‌యార్డు నింగికీ నేలకీ మధ్య సముద్రపు చీకటిలో కలిసిపోయింది.

ధర్మదేవత నాలుగు కాళ్ళతో నడిచే దేశం సింగపూర్. ప్రజలు అన్నీ సక్రమంగా, న్యాయ బద్ధంగా చేస్తారని ప్రతీతి. అయినా కొత్త సంవత్సరం ఆ మనుష్యుల్లో కొత్త ఆలోచనలు రేపింది కాబోలు. కొందరు స్వార్ధపరులు ఊరు మీద పడి దోపిడీలు మొదలు పెట్టారు. రేడియో ఫోన్‌ల ద్వారా సందేశాలను తీసుకునే పోలీసులకు ఆ సందేశాలు అందకపోవటంతో, దొంగల పని చాల సులభం అయింది.

## పాట్నా - ఇండియా:

సింగపూర్‌లో కొత్త సంవత్సరం వచ్చిన ఒకటిన్నర గంటలకు, ఇండియాలో కొత్త సంవత్సరం వస్తుంది.

పాట్నాలోని లాలూస్ బార్‌లో యువతీ యువకులంతా మూడవ సహస్రాబ్ది కోసం ఎదురు చూస్తున్నారు. రోజూ లాగానే అక్కడ ఆ రోజు కూడా కరెంటు పోవటం వల్ల, ముందుగానే పెట్రోమాక్స్ లైట్లతో, డీజిల్ జనరేటర్లతో ఎంతో కాంతివంతంగా అలంకరించారు. అక్కడ అంతా

ఉత్సాహంగా డాన్సులు చేస్తున్నారు. ముంబాయి నించి వచ్చిన బాలీవుడ్ బాండ్ చక్కటి సంగీతాన్ని సరళంగా అందిస్తున్నది. వాతావరణం వయసు మీరిన వారిని కూడా డాన్స్ ఫ్లోర్‌లోకి ఆహ్వానిం చేట్టుగా వుంది.

సరిగ్గా పన్నెండు గంటలయింది.

కొత్త సంవత్సరం వచ్చింది.

కొత్త శతాబ్దం వచ్చింది.

కొత్త సహస్రాబ్ది వచ్చింది.

ఎవరికోసమూ, దేనికోసమూ ఆగని కాలం మాత్రం ఆత్రంగా వచ్చేసింది.

ఆ చారిత్రాత్మక సంఘటన, పండుగ అందరి హృదయాలనూ దోచుకుని వాళ్ళందరికీ కలకాలం ఒక మధుర స్మృతిగా నిలిచింది.

లాలూస్ బార్ వెనుకనే వున్న రైలు గేటు మూసేసి, ఆకు పచ్చటి దీపం గాలిలో ఎత్తి పట్టుకున్నాడు లైన్‌మేన్. కూ..... కూ...... అని అరుచుకుంటూ ఆ చల్లగాలిలో అతన్ని దాటి వెళ్ళిపోయింది రైలు బండి.

కొత్త సంవత్సరపు వేడుకలు చూడటానికి వచ్చిన ట్రాఫిక్‌ని రోజులాగానే ముగ్గురు పోలీసులు చేతి సంజ్ఞలతో కంట్రోలు చేస్తున్నారు రోడ్డు మీద.

ఖద్దరు పంచెలు, కాషాయం పంచెలు కట్టుకున్న ఘరానా పెద్దమనుష్యులు, మత్తుగా నిద్రపోవటం వల్ల ప్రజా జీవనం ప్రశాంతంగా వుంది.

కొంచెం అవతలగా గుట్ట మీద వున్న గుడిలో అఖండ పూజ జరుగుతున్నది.

సృష్టికర్త అయిన ఆ భగవంతుడి నామస్మరణతో వాతావరణం స్పందిస్తున్నది.

ఆ గుడిలో దేవుడికి నమస్కరిస్తున్న అమ్మ ఒడిలో పడుకుని వున్న పిల్లవాడు మాత్రం, అప్పుడే వచ్చిన నూతన సహస్రాబ్దిలోని తన బంగారు భవిష్యత్తుని పెద్ద పెద్ద కళ్ళు తెరుచుకుని మరీ చూస్తున్నాడు. ●

*(ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక: 1999)*